సాగు పోరుకు సిద్ధం

– నేడు సాగు నీటి సంఘాల ఎన్నికలు

పాలసముద్రం: సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేసినా మళ్లీ వాయిదా వేసింది. ప్రస్తుతం మళ్లీ ఎన్నికల హడావిడి మొదలైంది. తొమ్మిదేళ్ల క్రితం సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నేడు ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎల్‌సీఎల్ఎల్‌సీ మైనర్ ఇరిగేషన్ పరిధిలో 68 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో ఉన్న ఆయకట్టు రైతుల ఓటరు జాబితా సిద్ధం చేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

కూటమి సర్కారుకు మొదటి ఎన్నికలు

కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటిసారి క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తానన్న హామీని నెరవేర్చలేదు. రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయలేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. అలాగే గతేడాది రబీ, ఖరీఫ్ పంట నష్టపోయిన రైతులకు పరిహారం నేటికీ చెల్లించకుండా పెండింగ్ ఉంచారు. అధికారంలోకి వచ్చి రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించి నిరంతరం రైతులను మోసం చేస్తూ ఇప్పుడు సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధవుతున్న నేపథ్యంలో అన్నదాతలు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.


పోలింగ్ కేంద్రం ఎస్‌కేఆర్ పురం పాత చెరువు

చేతులెత్తే పద్ధతి

ప్రస్తుతం జరుగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలు చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నిర్వహించనున్నారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేసి ఆయా కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు, ప్రభుత్వం నోటిఫికేషన్లను పెట్టారు. పాలసముద్రం మండలంలో తొమ్మిది చెరువులకు ఈ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మండలం పేరు	సాగునీటి సంఘాలు	ఓటర్లు
గంగాధరనెల్లూరు	10	1724
శ్రీరంగరాజపురం	6	1980
కార్వేటినగరం	11	6387
వెదురుకుప్పం	3	575
పెనుమూరు	4	789
పాలసముద్రం	9	1493

ఉదయం 8 గంటలకే ..

శనివారం ఉదయం ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఈ సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎవరు పోటీ చేస్తున్నారు. ఎవరు మద్దతు ఇస్తున్నారు. అలాగే ఎవరు బలపరుస్తున్నారనే వివరాలను 8 గంటల నుంచి ప్రారంభించనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోటీ దారుల తుది జాబితా వెల్లడి చేస్తారు. అనంతరం చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఓటింగ్, లెక్కింపు తదనంతరం ప్రాదేశిక నియోజకవర్గ నీటి సంఘాలకు సంబంధించి సభ్యులను ఎన్నుకుంటారు. ఒక్కొక్క సంఘానికి 10 నుంచి 12 మంది సభ్యులుండే అవకాశాలున్నాయి. ఈ సభ్యులంతా కలసి మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమై ఆ నీటి సంఘ పరిధిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులంతా డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లతో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎనుకుంటారు. వీరంతా ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.


శ్రీకావేరిరాజుపురంలో సాగునీటి సంఘాల నోటిఫికేషన్

సర్వం సిద్ధం



సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశాం. రెవెన్యూ రికార్డుల్లో పేరున్న ఆయకట్టు రైతులందరూ అర్హులే. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇప్పటికే మేజర్, మైనర్ పరిధిలో టీసీలతోపాటు రైతులను గుర్తించాం. పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేస్తున్నాం. ఇరిగేషన్ అధికారులతో కలసి సమన్వయం చేసుకుని ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఎంపీడీఓ, ఏఓ, ఇలా మండల స్థాయిలోని గెజిటెడ్ ర్యాంకు అధికారులకు ఎన్నికల విధులు అప్పగించారు.
– అరుణకుమారి, తహసీల్దార్, పాలసముద్రం

చేతులు ఎత్తే పద్ధతి



చేతులు ఎత్తే పద్ధతిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నాం. ఒక్కో సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను నియమించి వారిలో ఒకరిని చెర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆయకట్టు పరిధిలోని రైతులు మాత్రమే సంఘాలను ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నికల ఏకగ్రీవం కాని పక్షంలో ఓటింగ్ విధానం అమలు చేస్తారు.
– చీరాలయ్య, ఇరిగేషన్, ఏఈ

ప్రశాంతంగా నిర్వహించాలి



జీడీ నెల్లూరు నియోజకవర్గంలో నేడు జరుగుతున్న సాగునీటి ఎన్నికలు నిబంధనల మేరకు ప్రశాంతంగా జరిగేలా చూడాలి. పోలింగ్ కేంద్రాలకు ఆయకట్టు రైతులు మాత్రమే వెళ్లాలి. ఎన్నికల ప్రదేశాల్లో అలజడి సృష్టిస్తే ఉపేక్షించేదిలేదు. ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి.
– హనుమంతప్ప, సీఐ, కార్వేటినగరం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు: మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కళ్యాణపురం వద్ద ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నాగలాపురం: మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ రమేష్‌చంద్ర, సబ్ ఇంజనీర్ పృథ్వీ తెలిపారు. ఏడీ మాట్లాడుతూ, సబ్ స్టేషన్ల నిర్వహణ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

నేడు పుత్తూరులో నిరసన ర్యాలీ

పుత్తూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ హిందువులను రక్షించండి అనే నినాదంతో శనివారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక ఇన్‌చార్జి ఎం.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. హిందువులు, ఇతర మైనారిటీలపై జరుపుతున్న దాడులు, హత్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇస్కాన్ చిన్మయ్ కృష్ణదాస్‌ను జైలు నుండి విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఈశ్వరాలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ ధర్మరాజులస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అందరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బంగారమ్మ ఊరేగింపు

కార్వేటినగరం: సంస్థానాధీశుల కాలం నుంచి కార్తీక మాసంలో నిర్వహించే కార్వేటినగరం జాతర సందర్భంగా శుక్రవారం అమ్మవారి బంగారు విగ్రహాన్ని గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. సంస్థానాధీశుల ఆనవాయితీ ప్రకారం అమ్మవారి విగ్రహాన్ని భజన మందిరం నుంచి ఆస్థానాధీశుల ఇంటి వద్దకు ఊరేగింపుగా ప్రత్యేక వాయిద్యాల నడుమ తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల తోటి వేషధారణ ఆకట్టుకుంది. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధరనెల్లూరు: పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి 14 మందిని అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురం పంచాయతీలోని అల్లయ్య ఇటుకల బట్టీ వద్ద పేకాట ఆడుతుండగా మెరుపు దాడి చేసి 14 మందిని పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, 10,370 రూపాయల నగదు, తొమ్మిది ద్విచక్ర వాహనాలు, 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాటాడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది గోపాల్ బాబు, శరత్, కిషోర్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి


గంగాధరనెల్లూరు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గంగాధరనెల్లూరు మండల పరిధిలోని అంబోధరపల్లె సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. పలు సర్వేలను పూర్తిచేసి అప్‌లోడ్ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి లోకేష్ పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కీళపట్టు అండర్ బ్రిడ్జి ఛిద్రం


ఛిద్రమైన రోడ్డుపై నడచి వెళుతున్న గ్రామస్తులు

నగరి: ఉదయం నుంచి కుశస్థలి నది పరవళ్లు తొక్కడంతో కీళపట్టు మార్గంలోని అండర్ బ్రిడ్జి ఛిద్రమైంది. సాయంత్రం నీటి ప్రవాహం తగ్గిన తర్వాత వంతెన కొట్టుకుపోయి ఛిద్రమై కనిపించింది. అటువైపు వాహనాలు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. నడిచి వెళ్లాలన్నా జాగ్రత్తగా వెళ్లాల్సి వచ్చింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే కీళపట్టు, నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురం, తడుకుపేట, ముడిపల్లి, మేళపట్టు ప్రాంతాలకు చెందిన వారు అత్యంత జాగ్రత్తగా ఈ మార్గంలో నడచివెళ్లారు. తమిళనాడుకు వెళ్లే బస్సులను మరో వంతెన వైపుగా దారి మళ్లించారు.

కూలిన పాఠశాల ప్రహరీ



పాలసముద్రం: సబ్‌పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ ప్రస్తుతం కురిసిన వర్షాలరే శుక్రవారం కూలిపోయింది. వర్షాలు కారణంగా పాఠశాల సెలవు కావడంతో విద్యార్థులు లేరు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన ప్రహరీని నిర్మించాల్సి ఉంది.

208 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

గంగాధరనెల్లూరు: మండలంలో డిసెంబర్ ఒకటో తేదీ నుండి 13వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 53 మిల్లీమీటర్లు కాగా 208 మిల్లీమీటర్లుగా నమోదైందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. తుపాను ప్రభావంతో ఎలాంటి పంట, ఆస్తి నష్టం సంభవించలేదని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్


జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌లో 3 బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో తనతోపాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ ప్రిసీడింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కక్షిదారులు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కోరారు.

పారిశుధ్య పనులు పరిశీలించాలి

నింద్ర: వర్షాకాలం కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలలన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి, నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నిలదీద్దాం


కలెక్టరేట్ ముట్టడికి వెళ్లుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు


రైతు కండువాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, రైతులు

- గత ప్రభుత్వంలోనే రూ.13 కోట్లు మంజూరు
- స్థలాలను పరిశీలించిన ఆర్డీఓ రామ్మోహన్

కార్వేటినగరం: ఉచిత హామీలతో అధికారాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిలదీయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గం కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం మండలం నుంచి అత్యధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు చిత్తూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి మాట్లాడుతూ అధికారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉచిత హామీలిచ్చి రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలన్నారు. అలాగే ఉచిత బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచారని గుర్తు చేశారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరుతున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

తరలిన వైఎస్ఆర్ సీపీ శ్రేణులు

గంగాధరనెల్లూరు: రైతులకు అండగా వైఎస్ఆర్ సీపీ కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు భారీ ఎత్తున తరలివెళ్లాయి. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మికి ఘన స్వాగతం పలికి రైతు కండువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా సీడీసీఎంఎస్ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, మండల సీనియర్ నాయకులు సర్పంచ్ముని రాజారెడ్డి, గోవిందరెడ్డి, మోసెస్, ఢిల్లీ కుమార్, త్యాగరాజు, గోవిందయ్య పాల్గొన్నారు.

పుత్తూరులో మూడు ఎస్‌టీపీ కేంద్రాలు

పుత్తూరు: పుత్తూరులో మూడు సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్‌టీపీ) మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు కోసం 6 ఎకరాల స్థల సేకరణకు గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రూ.13 కోట్లు మంజూరు చేసింది. ఈ స్థలాల పరిశీలన కోసం తిరుపతి ఆర్డీఓ బి.రామ్మోహన్ శుక్రవారం పుత్తూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పుత్తూరులో ఏర్పాటు చేసే కేంద్రం కోసం 3 ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అలాగే నేసనూరు, గోవిందపాళెంలో ఒకటిన్నర ఎకరాల వంతున స్థలాల పరిశీలన చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రైవేటు భూములను సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. స్థల సేకరణ అనంతరం కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే మరుగుదొడ్ల మురుగునీరు డ్రైనేజీల ద్వారా చెరువులు, ఇతర గుంటల్లోకి వదులుతున్నారని తెలిపారు. దీంతో మంచినీరు సైతం మలినమైపోతున్న నేపథ్యంలో ఈ ఎస్‌టీపీ కేంద్రాల అవసరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాలు సేకరించిన మురుగునీటిని శుద్ధి చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


పుత్తూరులో స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ

వైభవంగా కార్తీక దీప పూజలు




కరకంతేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చంద్రమౌళేశ్వర ఆలయంపై కార్తీక దీపం

నగరి: పలు ఆలయాల్లో శుక్రవారం కార్తీక దీపం పూజలు వైభవంగా జరిగాయి. ఆలయాలు దీపపు కాంతులతో కళకళలాడాయి. స్థానిక కరకంతేశ్వర స్వామి ఆలయంలో కామాక్షి సమేత కరకంతేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో తిరువణ్ణామలై కార్తీక దీపాన్ని పోలిన విధంగా ఆలయంపై పెద్ద దీపాన్ని వెలిగించారు. ఆలయానికి దీపాలంకరణ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. దేశమ్మ ఆలయంలో నిర్వహించిన కార్తీక పూజల్లో ఆలయ గోపురంపై దీపం వెలిగించారు. బుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో మహిళలు ఉదయం నుంచే కార్తీక దీప పూజలు నిర్వహించారు. ముగ్గులు వేసి, దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. ఓంశక్తి ఆలయంలో, కొత్తపేట అగరవినాయక స్వామి ఆలయంలో దీపపు పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి ముంగిట దీపాలు వెలిగించడంతో వీధులు దీపాలతో దర్శనమిచ్చాయి.

ఘనంగా కార్తీక దీపోత్సవం

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయంలో ఈశ్వరలింగాన్ని ఏర్పాటు చేసి ఆలయంలో నేతి దీపాలను వెలిగించారు. భూపతి రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి అఖండ జ్యోతిని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘ ఎన్నికలు

విజయపురం: మండలంలో శనివారం 12 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్నూరు, మాధవరం, ఆలపాకం పెద్ద చెరువు, ఆలపాకంకండ్రిగ, బూచివానత్తం, ఆమగుంట, కేవీపురం, మంగళం, గురుస్వామిచెరుదు, విజయపురం, కోసలనగరం, కళియంబాకం చెరువులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కోసలనగరం చెరువు సంబంధించిన ఎన్నికలు సచివాలయంలో జరుగుతాయని, మిగిలిన చెరువులకు ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 12 చెరువులకు మొత్తం 1687 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1205 మంది పురుషులు, 482 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

17న షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ మొరవ గ్రామంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులను ఈ నెల 17న మంగళవారం వేలం వేయనున్నట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు డీఎల్‌పీఓ ఉత్తర్వుల మేరకు తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాలని కోరారు.

ఘనంగా ప్రత్యేక పూజలు


నెయ్యి దీపానికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం పంచాయతీ రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి శుక్రవారం కార్తిక పౌర్ణిమ పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి వివిధ అభిషేకాలు చేశారు. స్వామివారి ఎదుట 25 కిలోల నెయ్యితో దీపం వెలిగించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు గెలిగించి స్వామివారికి తొమ్మిది సార్లు ప్రదక్షిణలు చేసి, తమ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకావేరిరాజుపురం పాలకొండపై వెలసిన శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపం వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


పాలకొండపై దీపం వెలిగిస్తున్న భక్తులు

భక్తిప్రపత్తులతో ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణ గిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి పాలతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.


విశేష అలంకరణలో నందీశ్వరుడు

ముంచెత్తిన వాన

వడమాలపేట(విజయపురం): అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులు కురిసిన ఎడతెరిపిలేని వర్షం కారణంగా వడమాలపేట మండలంలో పంటలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. వడమాలపేట వంతెన కుంగిపోవడంతో పోలీసులు రాకపోకలను నిలిపేశారు. టీసీ అగ్రహారం, పాదిరేడులో వరి పంట నీట మునిగిపోగా, కొన్ని చోట్ల ఇసుక దిబ్బలు చేరాయి. అలాగే పాదిరేడు నుంచి కల్లూరు వెళ్లే గ్రామీణ రోడ్లు అక్కడక్కడా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే విజయపురం మండలం ఇల్లత్తూరులో వరి పంట నీట మునిగిపోయింది. అలాగే పెసలు, మినుము, కూరగాయ పంటలు స్వల్పంగా దెబ్బతినడంతో రైతులు తీవ్ర నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


వడమాలపేట వంతెన కుంగిపోవడంతో రాకపోకలు మూసివేసిన పోలీసులు

వంతెనపై నుంచి పారుతున్న కుశస్థలి నది



ఉగ్ర కుశస్థలి

- కుశస్థలి నదికి వరద ప్రవాహం
- మునిగిన లోతట్టు వంతెన
- రాకపోకలకు తప్పని కష్టాలు
- హైలెవల్ వంతెన నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే టెండర్ల ఆహ్వానం
- జాప్యమెందుకన్న బాధిత గ్రామస్తులు

నగరి: వరుస వర్షాలకు కృష్ణాపురం డ్యామ్ నిండడంతో గురువారం రాత్రి గేట్లు తెరిచారు. దీంతో కుశస్థలి నది నీటితో ఉప్పొంగింది. నదిలో ఏపుగా పెరిగిన ముళ్లకంపలను ముందుకు తోసుకుంటూ కుశస్థలి నది ముందుకు ఉరికింది. యథావిధిగా నది నీరు కీళపట్టు మార్గంవైపు ఉన్న లోతట్టు వంతెన పైనుంచి వేగంగా పారడంతో ఆవైపు రాకపోకలను ఆపేశారు. పోలీసులు ఎవరూ ఆ వైపు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టారు. డ్యామ్ గేటు తీసిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. వంతెనపై రోడ్డు తీవ్రంగా ఛిద్రమవడంతోపాటు పలుమార్లు కొట్టుకుపోతోందని, హైలెవల్ వంతెన వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే మూడేళ్లపాటు జరిగిన పనులు ప్రస్తుతం ఆగిపోయాయి. వంతెన పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్గంపై ప్రధానంగా ఆధారపడిన గ్రామస్తులు వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

టెండర్ దశలో పనులు

2021 డిసెంబరు 6వ తేదీన లో ఈ మార్గంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి మాజీ మంత్రి ఆర్కే రోజా శ్రీకారం చుట్టి అప్పటి ముఖ్యమంత్రికి అభ్యర్థనలు పెట్టుకున్నారు. 2022 జూన్ 18వ తేదీన ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వంతెన నిర్మాణం మంజూరై ఎస్టిమేషన్లు పూర్తయ్యాయి. 2023లో సాయిల్ టెస్టు, టెక్నికల్ శాంక్షన్లు ముగిశాయి. 2024 జనవరి 30వ తేదీన రూ.8.14 కోట్ల నిధులతో వంతెన నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించాలంటూ విజయవాడ ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ వారు కమిషనర్ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ వారికి ఆదేశాలు పంపగా 2024 ఫిబ్రవరి 5వ తేదీన టెండర్లు ఆహ్వానించారు. ఈ దశ వరకు జరిగిన వంతెన పనులు ఆపై ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి.

నిండుకుండల్లా చెరువులు

నింద్ర: మండలంలోని 42 చెరువులు వర్షానికి పూర్తి స్థాయిలో నిండాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షలకు నింద్ర, అత్తూరు, అగరం, ఇరుగువాయి, కావునూరు పెద్ద చెరువులు నిండాయి. గతంలో 50 శాతం నీరు వచ్చి ఉండడంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పూర్తిగా నిండాయి. దీంతో రైతులకు సంవత్సరంపాటు పంటలకు నీటి సమస్య ఉండదని వాపోతున్నారు. మండలంలోని తహశీల్దార్ శేషగిరి రావు పలు కాజ్‌వేలను పరిశీలించారు. నీరు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


నిండిన నింద్ర చెరువు

మునిగిన కూరగాయ పంటలు

నింద్ర: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వివిధ రకాల కూరగాయల పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. పొలాల్లోకి భారీగా నీరు చేరింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఫెంగల్ తుపానుతో వచ్చిన వర్షానికే చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. అప్పటి నీరే పొలాల్లో ఇంకా ఉండిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


నీటిలో మునిగిన వంగ తోట

చేపల కోసం పరుగులు


ఎస్‌బీఆర్‌పురం చెరువు వద్ద చేపలు పడుతున్న గ్రామస్తులు

వడమాలపేట(విజయపురం): మండలంలో రెండు రోజులు కురిసిన వర్షానికి చెరువులు, గుంటలు నిండి కలుజు పారుతున్నాయి. నీటిలో కొట్టుకుపోతున్న చేపలను పట్టుకోవడానికి గ్రామస్తులు కలుజు వద్దకు కుటుంబ సమేతంగా పరుగులు తీస్తున్నారు. వారికి కావాల్సిన చేపలను ఉంచుకుని మిగిలిన చేపలను అమ్ముకుంటున్నారు.